క్లుప్తంగా

పెదవలసలో క్యాన్సర్ వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

గూడెంకొత్తవీధి: మండలంలోని పెదవలసలో శుక్రవారం వైఎస్ విజయమ్మ ట్రస్ట్, గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. శిబిరంలో రొమ్ము, గర్భాశయ, నోటి తదితర క్యాన్సర్ పరీక్షలు చేశారు. పెదవలస వైద్యాధికారి కోమలి మాట్లాడుతూ ముందుగా పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్‌ను నిరోధించవచ్చన్నారు. 150 మందికి పరీక్షలు నిర్వహించాన్నారు. సిబ్బంది శ్రీనివాస్, హెచ్ఈ బాలరాజు పాల్గొన్నారు.

పాఠశాలలకు విద్యాకానుక కిట్లు పంపిణీ



ఉపాధ్యాయులకు విద్యా కానుక కిట్లు అందజేస్తున్న ఎంఈవో ప్రసాద్

చింతపల్లిరూరల్: మండలంలో వివిధ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం ఎంఈవో పనసల ప్రసాద్ శుక్రవారం అందజేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుచూపుతో పాఠశాల పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందజేయాలని నిర్ణయించుకొని ప్రత్యేక శ్రద్ధ వహించింది. ఈ మేరకు ముందస్తుగానే ఆయా కిట్లును సెలవుల్లోనే వివిధ మండల కేంద్రాలకు తరలించారు. ప్రస్తుతం పాఠశాల పునఃప్రారంభం కావడంతో మండల విద్యాశాఖాధికారులు వివిధ పాఠశాల ఉపాధ్యాయులకు కిట్లను అందజేస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం ఇతర సామగ్రి అందడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే గుర్తింపు రద్దు



ప్రైవేట్ పాఠశాలల యజమానులకు నోటీసులు ఇస్తున్న ఎంఈవో తలుపులు

నర్సీపట్నం: అధిక ఫీజులు వసూలు చేస్తే ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేస్తామని ఎంఈవో సీహెచ్.తలుపులు తెలిపారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు శుక్రవారం ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు చేపట్టారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమించిన నలంద, శ్రీవిద్యాంజలి, అమరావతి, నారాయణ పాఠశాలలకు నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు అధిక ఫీజులు వసూలు చేసినా, పుస్తకాలు, యూనిఫాం విక్రయించినా జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్లి గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా శ్రీకృష్ణ ఆలయ వార్షికోత్సవం

రోలుగుంట: కొండలపాలెంలోని శ్రీకృష్ణ భగవాన్ ఆలయ 14వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయకమిటీ సభ్యుడు గంగారాజు, రోలుగుంట పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ కర్రి వీరు నాయుడు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

రాజవొమ్మంగి అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

రాజవొమ్మంగి: మండల అభివృద్ధికి తొలి ప్రాధాన్యమిస్తానని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి హామీ ఇచ్చారు. శుక్రవారం ఆమె స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. స్థానిక సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెద్దిరాజు, సర్పంచ్ రమణి, జెడ్పీటీసీ జ్యోతి పాల్గొన్నారు.

మన్యంలో పసుపు సొగసు



చింతపల్లి మండలంలోని పెదబరడ పంచాయతీ సరిపురంలో పసుపు పంట



పసుపు కొమ్ములను సేకరిస్తున్న గిరిజన రైతులు (ఫైల్)

- సేంద్రియ పద్ధతిలో సాగు
- మార్కెట్‌లో గిరాకీ
- ఆశాజనకంగా ధరలు
- పెరుగుతున్న పంట విస్తీర్ణం
- జిల్లాలో 24,255 హెక్టార్లలో పసుపు సాగు



పసుపు మొక్కలు

అనంతగిరి: అల్లూరి జిల్లా ఏజెన్సీ వ్యాప్తంగా పసుపు సువాసన వెదజల్లుతోంది. కొండపోడుతో పాటుగా పల్లంగా ఉన్న భూముల్లో పసుపు సాగు విస్తారంగా చేపడుతున్నారు. మన్యం పసుపునకు దేశీయ మార్కెట్‌లో మంచి పేరొంది. ఇక్కడ సేంద్రియ పద్ధతిలో పండించడంతో నాణ్యమైన పసుపుగా గుర్తింపు పొందింది. ఏటా ధరలు కూడా పెరుగుతుండడంతో గిరిజన రైతులు మరింత ఎక్కువ విస్తీర్ణంలో పండిస్తున్నారు. పంట కాలం తక్కువ కావడంతో పాటు అన్ని వాతావరణాలు అనుకూలించడం, తెగుళ్ల బెడద లేకపోవడంతో పసుపు సాగుపై గిరిజన రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. జిల్లాలోని 22 మండలాల్లో 12 మండలాల్లో మాత్రమే పసుపు పంటను గిరిజన రైతులు సాగు చేస్తున్నారు. సాగులో ఉన్న మండలాలు జి.మాడుగుల, గూడెం కొత్తవీధి, చింతపల్లి, పెదబయలు, పాడేరు, ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ, అరకు



సంతలో పసుపు అమ్మకాలు (ఫైల్)

లోయ, కొయ్యూరు, హుకుంపేట, వై.రామవరం, మారేడుమిల్లి తదితర మండలాల్లో 24,255 హెక్టార్లలో పసుపు పంట సాగు చేస్తున్నారు.

అంతర పంటగా..

పెట్టుబడి తక్కువగా ఉండడంతో అధిక ఆదాయం వస్తుండడంతో అంతర పంటగా గిరిజన రైతులు పసుపు పంటను సాగు చేస్తున్నారు. ఎకరా విస్తీర్ణంలోని 10 కావిడ్ల వరకు పసుపు నాటితే 20 నుంచి 25 కావిడ్ల దిగుబడి వరకు వస్తుందని గిరిజన రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడం, వర్షాలు కురుస్తుండడంతో పంట దిగుబడులు పెరిగే అవకాశం ఉందంటున్నారు.

ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు

ఏజెన్సీ వ్యాప్తంగా సేంద్రియ పద్ధతిలోని గిరిజన రైతులు పసుపు సాగును చేస్తున్నారు. ఎరువులు, పురుగుల మందులను వాడకుండా, ప్రకృతి వ్యవసాయం ద్వారా కషాయాలు, సేంద్రియ ఎరువులను వినియోగిస్తున్నారు. మన్యం నేలా సారవంతం కావడంతో పంటకు మరింత అనుకూలమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేయడంతో అధిక దిగుబడులు పొందవచ్చని, కర్కుమిన్ కంటెంట్ 5 శాతం ఉంటుందని అధికారులు తెలియజేస్తున్నారు. అల్లూరి జిల్లాలోని మన్యంలో పండించే పసుపు నాణ్యతగా ఉండడంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని గిరిజన రైతులు చెబుతున్నారు.

జిల్లాలో సాగు వివరాలు

మండలం	పసుపు సాగు హెక్టార్లలో
ముంచంగిపుట్టు	1,208
డుంబ్రిగుడ	502
అరకులోయ	35
కొయ్యూరు	32
పాడేరు	1,632
జి.మాడుగుల	6,400
జీ.కె.వీధి	5,878
చింతపల్లి	5,835
పెదబయలు	1,875
హుకుంపేట	798
వై.రామవరం	50
మారేడుమిల్లి	10

పసుపు సాగుపై ప్రోత్సాహం

ఏజెన్సీ వ్యాప్తంగా పసుపు పంటను సాగు చేస్తున్న రైతులకు ఐటీడీఏ ఆధ్వర్యంలోని ప్రభుత్వం ప్రోత్సహించే విధంగా జిల్లా అధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో మన్యంలో పండించే పసుపు మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. ఫలితంగా రైతులకు మంచి లాభాలు వచ్చాయి. గతేడాది పసుపు క్వింటా సుమారు రూ.11వేలు ఉండగా ఈ ఏడాది రూ.12,500 ఉన్నట్టు చెబుతున్నారు. హార్టీకల్చర్ ఉన్నతాధికారుల ప్రోత్సాహం వల్ల రానున్న రోజుల్లో మరింత ధరలు రావచ్చని రైతులు ఆశిస్తున్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ మురళీ తదితరులు

దేవీపట్నం: ఇందుకూరుపేట రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయాధికారి ఆర్.ప్రశాంతి, టీడీపీ మండల అధ్యక్షుడు, నాయకుల ఆధ్వర్యంలో రైతులకు శుక్రవారం వరి విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం ఏవో ప్రశాంతి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రైతు భరోసా కేంద్రంలో ఎంటీయు-1318, 1064 రకాలు విత్తనాలు అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీతో అందజేస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీపీ కుంజం మురళీ, జెడ్పీటీసీ సభ్యురాలు శిరసం సత్యవేణి, వైస్ ఎంపీపీ గారపాటి మురళీ, టీడీపీ మండల అధ్యక్షుడు మరిశెట్టి బుజ్జిబాబు, నాయకులు మెహర్‌బాబాగౌడ్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

రాజవొమ్మంగి: మండలంలోని లాగరాయి గ్రామంలో లాగరాయి పీహెచ్‌సీ వైద్యాధికారి ఉషశ్రీ నేతృత్వంలో శుక్రవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ జరిగింది. మలేరియాపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు. దోమతెరలు ఉపయోగించాలని, వాడుక నీరు నిల్వ లేకుండా చూడాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్, సీహెచ్ఓ కృపాచార్యులు, స్టాఫ్ నర్స్, సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.



లాగరాయిలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీలో పాల్గొన్న సిబ్బంది

అదుపు తప్పిన ఆటో: ఒకరికి గాయాలు

పాడేరు : మండలంలోని గుత్తులపుట్టు సమీపంలోని వంతాలగుమ్మి మలుపు వద్ద ఆటో అదుపు తప్పి చిన్నపాటి లోయలోకి దూసుకువెళ్లడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుమెట్ట గ్రామానికి చెందిన ముగ్గురు గిరిజనులు వ్యక్తిగత పనుల నిమిత్తం తమ ఆటోలో శుక్రవారం పాడేరుకు వచ్చారు. పనులు ముగించుకొని సాయంత్రం గ్రామానికి వెళ్తుండగా మండలంలోని గుత్తులపుట్టు సమీపంలోని వంతాలగుమ్మి మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పి చిన్నపాటి లోయలోకి దూసుకుపోయింది. ఈ సంఘటనలో హుకుంపేట మండలం మఠం కొత్తూరు గ్రామానికి చెందిన కె.సంజీవ్‌కు గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించారు. ఆటోలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరికి గాయాలు కాలేదు. ఈ ప్రమాదంలో ఆటో పాక్షికంగా ధ్వంసమైంది.



చిన్నపాటి లోయలోకి దూసుకుపోయిన ఆటో

లలితాపీఠంలో కుర్తాళం పీఠాధిపతి

సీతంపేట: కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ మహా స్వామి సుమారు ఐదు నెలల తర్వాత అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితాపీఠానికి విచ్చేశారు. పండితులు వేదమంత్రాలు, పూర్ణ కుంభంతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన పీఠం పురోహితులను ఆశీర్వదించారు. చాలా రోజుల తర్వాత స్వామీజీ పీఠానికి విచ్చేయడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి దర్శనం కోసం వచ్చారు. పీఠం దర్బారు హాలులో స్వామీజీ కాసేపు కూర్చుని భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నెలాఖరు వరకు స్వామీజీ పీఠంలో ఉంటారని, విశేష పూజా, సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొంటారని మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. స్వామిని కలవడానికి ముందుగా అనుమతి తీసుకోవాలని, ఇందుకోసం 98492 86779ను సంప్రదించాలని సూచించారు.



కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి

మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులకు దగా



కాతారి సురేష్‌కుమార్

పెదబయలు: రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉందని మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులకు ధగా చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చూస్తున్నారని అల్లూరి జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు కాతారి సురేష్‌కుమార్ అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో జీఓ నంబర్-3 పునరుద్ధరణ చేసి డీఎస్సీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా 50 వేల పోస్టులు ఖాళీలు ఉండగా కేవలం 16,347 టీచర్ పోస్టుల భర్తీకి మొదటి సంతకం చేశారన్నారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా అరకు సభలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే జీఓ నంబర్-3 పునరుద్ధరణకు కృషి చేస్తామని హామీ ఇచ్చారని దీనికి కట్టుబడి ఉండాలన్నారు. ప్రత్యేక డీఎస్సీ ప్రకటించి, గిరిజన నిరుద్యోగులను న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో 1/70 చట్టం పటిష్టంగా అమలు చేయాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లక్షల గ్రామ సచివాలయాల ఉద్యోగాలతో పాటు ఇతర విభాగాల్లో పోస్టులు భర్తీ చేశారన్నారు. అలాగే ఏజెన్సీలో గిరిజన డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు.

వాసవీమాత ఆలయంలో ప్రత్యేక కుంకమ పూజలు

మాడుగుల రూరల్: మండలంలోని జంపెన వాసవీమాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కుంకమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పుట్టా మోహన్‌రావు ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. కింతలి గాదిరాయి వాసవీ క్లబ్ సభ్యులు, మహిళలు పూజల్లో పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయంలో..

కేజే పురం జంక్షన్‌లో గల సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక కుంకమ పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లినాయుడు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

సంతల్లో మోసాలను అరికట్టాలి



అధికారి శ్రీహరితో సమావేశమైన వినియోగదారుల సంఘాల ప్రతినిధులు

పాడేరు : ఏజెన్సీ వారపు సంతల్లో యథేచ్ఛగా జరుగుతున్న మోసాలు, అక్రమాలు, కల్తీ వస్తువుల అమ్మకాలు తదితర అంశాలపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పెడ్కో చైర్మన్ మద్రి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పాడేరులో జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సి.శ్రీహరి హాజరయ్యారు. గ్రామాల్లో ప్రజలకు వినియోగదారుల చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించేందుకు కొంతమంది విద్యార్థులను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇచ్చామని మద్రి సత్యనారాయణ స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లోని కళాశాల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం ద్వారా ఏడాది పాటు శిక్షణ ఇస్తామని ఆయన చెప్పారు. అధికారులు వారపు సంతల్లో తనిఖీలు చేపట్టాలని కోరారు. జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రతినిధులు శివప్రసాద్, సోములు, సంగీత, బాలయ్య, నరేష్, రాజారావు, సతీష్‌కుమార్, భైరవమూర్తి పాల్గొన్నారు.

అరకు ఎమ్మెల్యేకు అభినందనలు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న హాస్టల్ వెల్ఫేర్ అధికారులు

అరకులోయ రూరల్: అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంనకు అరకు, డుంబ్రిగుడ మండలాల హాస్టల్ వెల్ఫేర్ అధికారులు అభినందనలు తెలిపారు. శరభగుడ హౌసింగ్ కాలనీలో నివాసముంటున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను శుక్రవారం హాస్టల్ వెల్ఫేర్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సన్మానం చేసి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారులు వైకుంఠరావు, విజయ, పద్మ, నాగేంద్ర, మాధవి, భువనేశ్వరి, రాజారావు తదితరులున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ప్రజాప్రతినిధులు



ఎమ్మెల్యే మత్స్యలింగంనకు సమస్యలపై వినతిపత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగను శుక్రవారం అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ, మండలాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలపై వినతులు అందజేశారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టి అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులు, భవన నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని వారు కోరారు. దీనిపై సానుకులంగా స్పందించిన ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పనులు పూర్తి అయ్యే విధంగా చూస్తామన్నారు. ఎంపీపీ ఉషారాణి, కో-ఆప్షన్ సభ్యుడు మదిన, ఎంపీటీసీ సభ్యులు ఆనంద్‌కుమార్, సత్యవతి, సర్పంచ్‌లు సీతయ్య, కన్నమ్మ, త్రినాథ్, నాయకులు రామ్మూర్తి, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



ఆమూరులో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

హుకుంపేట: మండలంలోని తీగలవలస పంచాయతీ ఆమురు, బిజ్జపల్లి, సరళం గ్రామల్లో శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఎంపీహెచ్‌వో కోడ సింహాద్రి, సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆయా గ్రామల్లో 57 మందికి వైద్య సేవలందించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందుస్తుగా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు సిబ్బంది తెలిపారు. ఎంపీహెచ్‌హెచ్ సాంబశివరావు, ఎంఎల్‌హెచ్‌పీ నాగమ ణి, సిబ్బంది భవాని తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని పలకజీడిలో శుక్రవారం యూ.చీడిపాలెం వైద్యులు జయప్రకాశ్ వైద్య శిబిరం నిర్వహించారు. మలేరియా సహా రక్తహీనత కలిగిన వారికి హెచ్‌బీ పరీక్షలను నిర్వహించారు. గర్భిణుల బలమైన ఆహారం తీసుకోవాలని కోరారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. రక్తహీనత కలిగిన వారు విధిగా హెచ్‌బీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు.

గిరిజన స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతూ సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు త్రినాథ్

ముంచంగిపుట్టు: గిరిజన నిరుద్యోగుల కోసం స్పెషల్ డీస్సీ నోటిఫికేషన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు, లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్ డిమాండ్ చేశారు.మండల కేంద్రంలో శుక్రవారం సీపీఎం నేతలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన నూతన డిఎస్సీలో గిరిజన ప్రాంతాల్లో ఉన్న ఆదివాసీ యువతకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. మెగా డిఎస్సీతో పాటు ఆదివాసీ డిఎస్సీ సైతం ప్రకటించాలని, మెగా డీఎస్సీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఏజెన్సీ ప్రాంతాల్లో అమలు చేయడం ,5వ షెడ్యూల్ నిబంధనలకు విరుద్ధంగా ఉందన్నారు. నూరు శాతం రిజర్వేషన్ అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉండాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జీఓ నెంబర్-3ను పునరుద్ధరణకు చట్టబద్ధత కల్పించాలని,ఆదివాసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు భీమరాజు, శంకర్‌రావు, రామదాసు పాల్గొన్నారు.

ఘనంగా చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే



సర్టిఫికెట్లు అందుకున్న చిన్నారులు



చిన్నారులకు అక్షరాభ్యాసం

కూనవరం: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు గ్రాడ్యుయేషన్ డేని సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో పి.నాగలక్ష్మి అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రం -1లో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో 5 సంవత్సరాలు నిండి పీపీ-1, పీపీ-2 పూర్తిచేసిన పిల్లలకు ప్రీస్కూల్ సర్టిఫికెట్లు అందజేశామన్నారు. చిన్నారులంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి క్రమశిక్షణ కలిగిన విద్యార్థులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో భాగంగా 3 సంవత్సరాలు నిండిన పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వనజాక్షి, అంగన్‌వాడీ కార్యకర్తలు రాణి, వరలక్ష్మి, రజినీకుమారి, రమాదేవి, లక్ష్మి, పార్వతి, చిన్నారుల తల్లిదండ్రులు, జీఎంఎస్కేలు, ఏఎస్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

32 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి నిందితులతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ నుంచి గంజాయి రవాణా చేస్తున్న నిందితులను గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్, సీటీడీటీ బృందాలు శుక్రవారం రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు నిర్వహించాయి. ఒడిశాకు చెందిన సూర్‌జిత్ నాయక్, గౌతమ్ నాయక్, ప్రశాంత్ నాయక్ టికిరి స్టేషన్ నుంచి విశాఖపట్నం మీదుగా సికింద్రాబాద్‌కు గంజాయిని తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని.. రూ.1.61లక్షల విలువైన 32.2 కేజీల గంజాయిని వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి.. రిమాండ్ నిమిత్తం తరలించినట్లు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు తెలిపారు.